సాక్షి బాపట్ల

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



ఆలయాల హుండీల లెక్కింపు

పొన్నూరు : సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానంలోని 20 హుండీలను శుక్రవారం లెక్కించగా రూ.6.81.958 ఆదాయం వచ్చిందని ఈఓ టి.శ్రీనివాసరావు తెలిపారు.



మోస్తరు వర్షాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 29 వరకు 214.4 మి.మీ వర్షపాతం నమోదైంది.



అమరేశ్వరుని హుండీ ఆదాయం

అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి గుడిలో శుక్రవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. రూ. 7.17.328 ఆదాయం వచ్చినట్లు ఈవో గోపీనాథశర్మ తెలిపారు.

న్యూస్‌రీల్

అక్టోబర్ 3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్ : గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో అక్టోబర్ 3న పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీసీపీ, ఈసీఈ, ఏఎఫ్‌టీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థినులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజుతో సహా హాజరు కావాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులకు వసతి గృహం కలదని, వివరాలకు 9912342015 నంబర్లో సంప్రదించాలని వెల్లడించారు.

పులివెందుల స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల స్పోర్ట్స్ అకాడమీలో వివిధ క్రీడలకు సంబంధించి ప్రవేశాలు జరుగుతాయని డీఎస్‌ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ జిల్లా క్రీడాకారులకు వచ్చే నెల 3 నుంచి 5 వరకు స్థానిక బీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. హాకీ, బాడ్మింటన్, బాస్కెట్ బాల్, టెన్నిస్, వాలీబాల్ విభాగాల్లో సెలక్షన్స్ ఉంటాయని చెప్పారు. 12 నుంచి 18 సంవత్సరాల వయస్సున్న బాలురు పాల్గొనవచ్చని చెప్పారు.

అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ (బీఆర్‌ఏఓయూ) దూరవిద్య బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరేందుకు తుది గడువు ఈనెల 30న ముగియనున్నట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ అధ్యయన కేంద్ర ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా యూజీ ద్వితీయ, తృతీయ, పీజీ ద్వితీయ సంవత్సర ఫీజులను చెల్లించేందుకు సైతం తుది గడువు ఈనెల 30న ముగియనుందని పేర్కొన్నారు. వివరాలకు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం

కలెక్టర్ శివశంకర్


నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆదేశాల మేరకు అక్టోబరు ఒకటో తేదీ నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో ఉదయం 10 గంటల నుంచి స్వచ్ఛ పక్వాడా–స్వచ్ఛ హీ సేవ కార్యక్రమం ఒక గంటపాటు నిర్వహించాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం ఆదేశించారు. గుర్తించిన ప్రదేశాలు, వీధులు, ప్రార్థనా మందిరాలు, విద్యా సంస్థలు, రైల్వే స్టేషన్లలో వ్యర్థాలను తొలగించి శుభ్రంచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్వయం సహాయక గ్రూపులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లు పాల్గొనాలన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోండి

కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా 30వ తేదీ శనివారం ఉదయం 7.30 గంటల నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖ అధికారులతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్షపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ముందుగానే ప్రజలందరికీ సురక్ష కార్యక్రమం గురించి తెలియజేయాలని ఆదేశించారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, గర్భకోశ, ఎముకల, చెవి, ముక్కు, గొంతు, గుండె వ్యాధి వైద్య నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు. 120 రకాల మందులు అందుబాటులో ఉంటాయని వివరించారు. అవసరమైన ల్యాబ్ పరీక్షలు చేస్తారని వివరించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, డీడీవో మహాలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేత



లక్ష్మీపురం(గుంటూరు): అగతవరప్పాడు(గడ్డిపాడు) రైల్వేగేటును ట్రాక్ మరమ్మతుల నిమిత్తం అక్టోబర్ 1 నుంచి మూసివేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 5వ తేదీ వరకు గేటును మూసివేస్తున్నట్టు ప్రత్యేకంగా ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు.

ప్రతిభ ప్రకాశించేలా..

- బాలలచే సైన్స్ ప్రాజెక్టుల రూపకల్పన
- 31వ నేషనల్ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనకు సన్నాహాలు
- ప్రభుత్వ పాఠశాలల నుంచి నూతన ప్రాజెక్టులకు ఆహ్వానం
- హైస్కూల్ స్థాయి నుంచి విద్యార్థుల్లో మేథస్సు వెలికితీత



గతేడాది సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, టీచర్స్ (ఫైల్)

వేటపాలెం: చిన్నప్పటి నుంచే బాలలకు సైన్స్ మీద ఆసక్తి ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. చిన్నారుల మెదళ్లలో పరిశోధనా రంగం మీద చిన్న విత్తనం నాటితే అది పెద్ద వ్యాక ఎన్నో మార్పులు తీసుకురావాలన్నదే ప్రభుత్వాల లక్ష్యం. సైన్స్, సాంకేతిక రంగాలు నేడు ఒక పెద్ద విప్లవం. ఇందులో విస్తృత అవకాశాలు ఎన్నో. ఈ రంగాల్లో బాలలకు చేయూతనిచ్చి వారి ఫలితాలను దేశానికి ఉపయోగపడేలా ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. హైస్కూల్ స్థాయి నుంచి విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి వివిధ సైన్స్ ప్రాజెక్టుల రూపకల్పన ఎంతో మేలు చేస్తుంది. అందుకే చిన్నారుల మెదళ్లలోని గట్టి ఆలోచనలకు పదును పెట్టి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఒక వేదికగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో ప్రాజెక్టుల రూపకల్పనకు చర్యలు చేపడుతున్నారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం, రాష్ట్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి జిల్లా సైన్స్ కాంగ్రెస్ చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది.

వివిధ విభాగాల్లో పోటీలు..

జిల్లాలోని హైస్కూళ్లలో అన్ని యాజమాన్యాల పరిధిలోని 6–12 తరగతుల విద్యార్థులు 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023లో పాల్గొనేందుకు అర్హులు. పాఠశాలలకు వెళ్లే వారితోపాటు 10 నుంచి 17 ఏళ్ల లోపు బడి మానేసిన వారూ ఇందులో పాల్గొనవచ్చు. జిల్లాస్థాయి వరకు 10–17 ఏళ్లలోపు వారు పోటీల్లో పాల్గొనవచ్చు. రాష్ట్రస్థాయి పోటీల్లో 10 నుంచి 14 ఏళ్ల లోపైతే జూనియర్లుగా, 14 నుంచి 17 ఏళ్ల లోపు వారిని సీనియర్లుగా విభజించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, సృజనాత్మకతను ప్రోత్సహించి నిత్యం జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు సిద్ధం చేయించాలన్నదే జిల్లా సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనల ముఖ్య ఉద్దేశం. జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన తేదీని త్వరలో తెలియజేస్తారు.

ప్రాజెక్టుల రూపొందించుకొనే విధానం..

- జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించే ప్రాజెక్టులు సైన్స్ సూత్రాలను ప్రదర్శించే నమూనాలుగా ఉండాలి. ప్రాజెక్టులు ప్రధాన అంశానికి లోబడి, ఏదేని ఉప అంశానికి చెంది ఉండాలి.
- ఇద్దరు విద్యార్థులు టీమ్‌గా ప్రాజెక్టు నిర్వహించాల్సి ఉంటుంది.
- మంచి శీర్షికతో నిర్దేశిత భౌగోళిక ప్రాంత పరిధిలో ప్రాజెక్టు నిర్వహించాలి.
- పరిశోధన ఫలితాన్ని వివరించాలి.. వ్యాఖ్యానించాలి. సమస్యకు పరిష్కారాన్ని సూచించాలి.
- ప్రాజెక్టు మొత్తాన్ని రిపోర్టు రూపంలో డాక్యుమెంట్‌గా రూపొందించి పోటీల్లో అందజేయాలి.

ప్రధాన, ఉప ప్రధాన అంశాలు..

ఈ ఏడాది ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడాన్ని ప్రధాన అంశంగా విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంది.

- మీ పర్యావరణ వ్యవస్థను తెలుసుకోవాలి.
- ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సును పెంపొందించడం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక సాంస్కృతిక పద్ధతులు.
- స్వీయ ఆధారితం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్య కోసం సాంకేతిక ఆవిష్కరణలు ఉప అంశాలుగా తీసుకోవాలి.
- విద్యార్థులు ఈ ఐదు ఉప అంశాల్లో నమూనాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రతి ఏడాదీ విద్యార్థులు పాల్గొంటారు



ప్రతి ఏడాది విద్యార్థులతో నూతన సైన్స్ ప్రాజెక్టులు రూపొందించి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పాల్గొంటారు. ఈ ఏడాది జరిగే పోటీలకు విద్యార్థుల నూతన ప్రాజెక్టులు రూపొందిస్తున్నారు. వారికి కావాల్సిన సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

ఎం.జనమ్మ, సైన్స్ టీచర్, వేటపాలెం

సైన్స్ టీచర్ల మార్గదర్శకత్వం..



ప్రతి పాఠశాల నుంచి కనీసం రెండు ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తుంటారు. ప్రాజెక్టులు రూపొందించే విద్యార్థులకు సైన్స్ టీచర్లే గైడ్ టీచర్లుగా వ్యవహరిస్తారు. విద్యార్థులకు ఇదొక సువర్ణావకాశం.

ఎం.వెంకటేశ్వరావు, హెచ్‌ఎం, పందిళ్లపల్లి

సంక్షేమ హా'రన్'



ఆటో డ్రైవర్లకు చెక్కు అందిస్తున్న డాక్టరు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్

- డ్రైవర్లకు ఆర్థిక భరోసా
- జిల్లాలో 6,772 మందికి లబ్ధి
- రూ.6.77 కోట్ల మేర ప్రయోజనం

బాపట్ల: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఏపీ శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ఆటో, ట్యాక్సీ, మాక్సీ క్యాబ్, ఎండీఎంయూ వాహన యజమానులు, డ్రైవర్లకు ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో శుక్రవారం బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి శాసనమండలి చీఫ్‌విప్ డాక్టరు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఇన్ చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తోపాటు లబ్ధిదారులు వర్చువల్‌గా వీక్షించారు. ఉమ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన 98శాతం హామీలను అమలు చేసిందని వివరించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ పేదల సంతోషమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా జిల్లాలో 6,772 మంది లబ్ధిదారులకు రూ.6.77 కోట్లు మంజూరు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో ఆర్టీఓ ఎ.చంద్ర శేఖర్‌రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్యం.. ప్రభుత్వ లక్ష్యం

ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్



ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్షిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్

బాపట్ల: వైద్యం కోసం పేదలెవరూ అప్పుల బారిన పడకుండా ఉచితంగా వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ తీసుకుపోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం నుంచి జిల్లాలో లాంఛనంగా జగనన్న సురక్ష ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా యంత్రాంగంతో ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎస్.విజయమ్మ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలి

శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: పరిశోధనల ద్వారా కొత్తరకం వంగడాలు సృష్టించిన ఎం.ఎస్.స్వామినాథన్ దేశ ప్రజల ఆకలి తీర్చారని శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కొనియాడారు. ఆయన కృషితోనే దేశానికి ఆహారభద్రత లభించిందన్నారు. అటువంటి వ్యక్తి మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఎం.ఎస్.స్వామినాథన్‌కు కేంద్రప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని ఉమ్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. స్వామినాథన్‌తో వ్యక్తిగతంగా తనకున్న అనుబంధాన్ని శనివారం బాపట్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన గుర్తుచేసుకున్నారు. బాపట్ల వ్యవసాయకళాశాల విద్యార్థిగా, ఆ తరువాత బోధకుడిగా కొనసాగిన తనకు స్వామినాథన్‌తో అనుబంధం ఉందన్నారు. వ్యవసాయ కళాశాల ప్రారంభంలో ఇక్కడికి అధ్యాపకులను ఆయనే పంపారని గుర్తుచేసుకున్నారు. 1989, 1996, 2006 సంవత్సరాల్లో స్వామినాథన్ బాపట్లను సందర్శించారని వివరించారు. 2006లో తన ఇంటికి వచ్చారని, ఈ సందర్భంగా ఆయనను సన్మానించినట్లు ఉమ్మారెడ్డి వెల్లడించారు. బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన ఎంవీ రెడ్డితో కూడిన శాస్త్రవేత్తల బృందం బీపీటీ 5204 సాంబ మసూరి రకం వరి వంగడాన్ని సృష్టించినప్పుడు స్వామినాథన్ అభినందించారని, సాంబమసూరి రకాన్ని అంతర్జాతీయ స్థాయికి పరిచయం చేసిన వ్యక్తి ఆయనేనని ఉమ్మారెడ్డి కొనియాడారు. ఆయన 70వ పుట్టినరోజు సందర్భంగా స్వయంగా వెళ్లి స్వామినాథన్ ఫౌండేషన్‌కు రూ.70 వేలు అందజేసినప్పుడు చాలా సంతోషపడ్డారని ఉమ్మారెడ్డి చెప్పారు. స్వామినాథన్‌తో అనుబంధం మరువలేనిదన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఉద్యోగం సాధించిన యువతికి ధ్రువపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా జరిగింది. కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. యువత అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంత్రి మేరుగ నాగార్జున ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంపికైన యువతకు ధ్రువపత్రాలు అందజేశారు. హెటిరో డ్రగ్స్, అపెక్స్ సొల్యూషన్స్, మాల్టెక్ సొల్యూషన్స్, ఐసీఐసీఐ గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, అమర్‌రాజ వంటి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 504 మంది హాజరు కాగా 152 మందిని కంపెనీలు ఎంపిక చేసుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగ కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని మేళాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జాబ్ మేళాకు జిల్లా ఉపాధి కల్పనాధికారి విష్ణుమూర్తి, జిల్లా నైపుణ్య అభివృద్ధి ప్రత్యేక అధికారి ఎ.శివనాగరాజు, యంగ్ ప్రొఫెషనల్ ఇ.హారికా సొగంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రోగులకు మేలు

జిల్లా నోడల్ అధికారి డీఎల్‌డీవో రాజేష్ వెల్లడి



కొప్పరపాలెంలో క్యాంపును పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి రాజేష్

బల్లికురవ: ప్రభుత్వం పేదలకు గ్రామాల్లోనే ఉచిత వైద్యసేవలు, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సచివాలయాల నోడల్ అధికారి డీఎల్‌డీవో ఎస్.రాజేష్ కోరారు. మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో శనివారం జరిగే క్యాంపునకు సంబంధించి శుక్రవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఇంటింటా సర్వేలో రోగులను గుర్తించిన డేటాను ఆయన పరిశీలించారు. రోగులు గ్రామంలో జరిగే క్యాంపునకు హాజరైయ్యేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్‌లు, వైద్యారోగ్యశాఖ ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లపై ఉందన్నారు. క్యాంపునకు కార్పొరేట్ వైద్యులు గ్రామాలకు వచ్చి వైద్యపరీక్షలు చేస్తారని ప్రతి రోగికి ఏడు రకాల పరీక్షలను అక్కడికక్కడే మందులు అందజేస్తారన్నారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్, సెక్రటరీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్ను పడిందా కన్నమే

- దొంగల ముఠా అరెస్టు
- పట్టించిన సీసీ కెమెరాలు
- విచారణలో బయటపడిన మరిన్ని చోరీలు
- రూ 22.7 లక్షల విలువైన వస్తువులు, నగదు రికవరీ
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



స్వాధీనం చేసుకున్న నగదు, నగలను చూపిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: సత్తెనపల్లి, గురజాల సబ్ డివిజన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను సత్తెనపల్లి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ముగ్గురు సభ్యులు ఉన్న ఈ గ్యాంగ్ కన్ను ఏ ఇంటిపైనైనా పడిందంటే కన్నం వేయాల్సిందే. పగలు, రాత్రి అనే భేదం అసలు ఉండదు. ఇప్పటివరకు ఈ ముఠా ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏడు చోరీలకు పాల్పడింది. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి తన కార్యాలయంలో కేసు వివరాలను విలేకరులకు వివరించారు. ఆయన కథనం ప్రకారం..

నకరికల్లు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉండే షేక్ జైనబ్ కుటుంబం ఈ నెల 5న పని నిమిత్తం నరసరావుపేటకు వెళ్లింది. మధ్యాహ్నం 3.20 గంటల సమయంలో దొంగల ముఠా ఇంటి తాళాలు పగలగొట్టి 150.696 గ్రాముల బంగారం, రూ.7.50 లక్షల నగదును అపహరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నకరికల్లు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ దొంగ నడక ఆధారంగా నిందితులను గుర్తించారు. గురజాల పట్టణానికి చెందిన రుద్రాల సురేష్, మహంకాళి గణేష్, ఎక్కులూరి నరేష్ ఈ చోరీ చేసినట్టు విచారణలో తేలింది. సత్తెనపల్లి రూరల్ సీఐ ప్రేమయ్య శుక్రవారం తన సిబ్బందితో కారెంపూడి క్రాస్ రోడ్డు వద్ద కారులో వెళ్తున్న ముగ్గురు దొంగలను అరెస్ట్ చేశారు.

90 శాతానికి పైగా సొత్తు రికవరీ

ముగ్గురు దొంగలను వేరువేరుగా పోలీసులు విచారణ చేశారు. దీంతో ఈ ఏడాదిలో తాము ఏడు దొంగతనాలు చేసినట్టు వారు ఒప్పుకున్నారు. అన్ని చోరీల్లో కలిపి సొత్తు విలువ రూ.24.5 లక్షలుగా పోలీసులు లెక్కకట్టారు. ఇందులో రూ.22.70 లక్షల విలువైన బంగారం, నగదును పోలీసులు రికవరీ చేశారు. మొత్తం 363.95 గ్రాముల బంగారాన్ని వీరు అపహరించగా మొత్తం రికవరీ చేయడం విశేషం. వీరి నుంచి మారుతీ షిఫ్ట్ డిజైర్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఈ ముగ్గురూ స్నేహితులు. కార్లను బాడుగకు తీసుకొని తాళాలు వేసిన ఇళ్లను రెక్కీ చేసి, స్క్రూడ్రైవర్ సహాయంతో తాళాలు పగలుగొట్టి చోరీలు చేయడం వీరికి వెన్నతోపెట్టిన విద్య. గతంలో రుద్రాల సురేష్ మీద 14 కేసులు, మహంకాళి గణేష్ మీద 3 కేసులు నమోదయ్యాయి. తక్కువ సమయంలో నిందితులను పట్టుకొని, వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకొన్న సీఐ ప్రేమయ్య, సిబ్బందిని ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు అందించారు.

పీఏసీఎస్‌లకు సహకారం

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము



సమావేశంలో మాట్లాడుతున్న లాలుపురం రాము వేదికపై యార్లగడ్డ భాగ్యలక్ష్మి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)లకు గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎల్లవేళలా సహాయ, సహకారాలను అందిస్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము స్పష్టం చేశారు. కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జీడీసీఎంఎస్ మహాజన సభ సమావేశం ఆ సొసైటీ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముందుగా జీడీసీఎంఎస్ 2021–22 ఆడిట్ రిపోర్టు, జమాఖర్చులను బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం సభ ముందు ప్రవేశపట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జీడీసీసీబీ చైర్మన్ రాము మాట్లాడుతూ మూడేళ్లుగా సహకార రంగంలో వస్తున్న కొత్త అవకాశాలను సొసైటీలు అందిపుచ్చుకోవాలని సూచించారు. కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటు, కంప్యూటరీకరణ, పెట్రోలు బంకులు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్, తదితర వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకుని పీఏసీఎస్‌లు లాభాల బాట పట్టాలన్నారు. వ్యవసాయమే దండగా అంటూ రైతులను చంద్రబాబు నట్టేట ముంచితే.. సేద్యాన్ని పండగ చేసి రైతులకు అన్ని విధాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దన్నుగా నిలిచారని కొనియాడారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడంతోపాటు, ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను రైతులకు అందించాలని కోరారు. రాష్ట్రంలోనే గుంటూరు డీసీఎంఎస్ ప్రథమ స్థానంలో ఉండడం సంతోషమన్నారు. డీసీఎంఎస్ ఉద్యోగులు, సిబ్బంది, రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం మాట్లాడుతూ 2022–23 సంవత్సరం ఆడిట్‌ను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2022–23 ఖరీఫ్ సీజన్‌లో 44 డీసీఎంఎస్ సేల్స్ పాయింట్ల ద్వారా 69,219.52 మెట్రిక్ టన్నుల ధాన్యం, రబీ సీజన్‌లో 23,189.52 మెట్రిక్ టన్నుల ధాన్యం, 3,381.40 మెట్రిక్ టన్నుల శనగలు, 7,291 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేసినట్టు వెల్లడించారు.

డీసీఎంఎస్ ద్వారా విశిష్ట సేవలు

- జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి

జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 44 డీసీఎంఎస్ సేల్స్ పాయింట్ల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువుల అమ్మకాలు సాగిస్తున్నామన్నారు. పురుగుమందుల అమ్మకాలు, ధాన్యం, మొక్కజొన్న, శనగల కొనుగోళ్లు కూడా చేస్తున్నట్లు వెల్లడించారు. 2022-23లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ, ప్రొవిజన్స్ ద్వారా రూ.69.26 కోట్ల వ్యాపారం చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.16.02 కోట్ల వ్యాపారం చేసినట్టు వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ముమ్ముందు రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు.

సమావేశంలో డీసీఎంఎస్ పాలకవర్గ సభ్యులు ఆరుమళ్ళ వెంకట శివ, ఆరికట్ల విజయ భాస్కరరెడ్డి, ప్రసాదం బాల గురవమ్మ, పాల్వాయి ఆదినారాయణ, దాసరి రాజు, కుర్రా పాములు, జీడీసీసీబీ పాలకవర్గ సభ్యులు, డీసీఎంఎస్ కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, నిజాంపట్నం రైతు సలహా మండలి అధ్యక్షుడు యార్లగడ్డ మదన్ మోహన్, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 పీఏసీఎస్‌ల చైర్మన్లు, ఇతర సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు లైవ్ ఐసీయూ ప్రారంభం

గుంటూరుమెడికల్: దేశంలోనే మొట్టమొదటి సారిగా లూసిడ్లీ ఇంటిగ్రేటెడ్ వైటల్ కేర్ ఇన్ ఎమర్జన్సీ (లైవ్) కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఏరియా హాస్పిటల్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని శనివారం ప్రారంభిస్తారని శ్రీ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి చెప్పారు. శుక్రవారం గుంటూరు అరండల్‌పేటలోని సమిష్టి హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (శ్రీ) లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత ఆధునికమైన స్మార్ట్ ఐసీయూ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఐసీయూను మంత్రి రజిని ప్రారంభిస్తారన్నారు. అత్యవసర చికిత్సల కోసం ఐసీయూకు వచ్చే రోగుల ప్రాణాలను రక్షించడమే ధ్యేయంగా లైవ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం అత్యాధునిక ఐసీయూ సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. తొలుత పైలెట్ ప్రాజెక్టుగా చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో శనివారం ఉదయం 10 గంటలకు మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారన్నారు. అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగుల ఆరోగ్య పరిస్థితి ప్రతి నిమిషం స్మార్ట్ ఐసీయూ ద్వారా క్రిటికల్ కేర్ వైద్యులకు సమాచారం ఆన్‌లైన్ ద్వారా వస్తుందన్నారు. గుంటూరులోని శ్రీహాస్పటల్‌లో ఐసీయూ స్పెషాలిటీ వైద్యులు సదరు సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు తక్షణ చికిత్సకు సూచనలు, సలహాలు అందజేస్తారన్నారు. సామాజిక బాధ్యతతో శ్రీహాస్పటల్ వైద్య బృందం గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఐసీయూ వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిందన్నారు.

సవాళ్లను అధిగమిస్తేనే విజయం

గుంటూరు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ దోనవల్లి లక్ష్మణ్

చేబ్రోలు: ఫార్మాస్యూటికల్ విద్యార్థులు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తేనే విజయం సాధించగలరని గుంటూరులోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ దోనవల్లి లక్ష్మణ్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ''ప్రివెంటివ్ అండ్ ఎమర్జెన్సీ మెడికల్ సైన్సెస్'' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కాన్ఫరెన్స్‌ను ''ఏ పారాడిమ్ షిఫ్ట్ ఆఫ్ క్లినికల్ ప్రాక్టీస్ ఫ్రమ్ హాస్పిటల్ టు కమ్యూనిటీ ఎట్ లార్జ్'' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం కారే మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ విద్యార్థులకు మన దేశంతో పాటు, ఇతర దేశాలలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు.

అండర్–19 కబడ్డీ జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక

చీరాలరూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం అండర్–19 కబడ్డీ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లాలో ఉన్న అన్ని జూనియర్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం.ఆదినారాయణరావు ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. జిల్లాలోని జూనియర్ కళాశాలల నుంచి 40 మంది బాల, బాలికలు హాజరయ్యారు. క్రీడా కారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కళాశాల రిటైర్డ్ లైబ్రేరియన్ పులగుర జయశీలరావు తన తండ్రి జయరావు జ్ఞాపకార్థం మంచినీరు, భోజన వసతి కల్పించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించినట్లయితే ప్రభుత్వ శాఖలలో మంచి ఉద్యోగాలు పొందవచ్చునని కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపల్ పి. సునీతలు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ కార్యదర్శి బొడ్డు సుబ్బారావు, గారపాటి పుష్పరాజు, పీడీలు కె.డేవిడ్‌రాజు, కె. బాపయ్య శెట్టి, రాఘవరెడ్డి, పూర్వ జాతీయ క్రీడాకారుడు బత్తుల మాణిక్యరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాలికల జట్టు..

పి.బాలాశ్రీ, ఎం.శ్రీలక్ష్మి, (యర్రగొండపాలెం), షేక్ షాకిరా (మార్కాపురం), కె.నందిని (పాకల), సీహెచ్ బ్లెస్సీ, అమూల్య (పాకల), ఎం.సురేఖ (చీరాల), డి.కీర్తి (చీరాల), ఎ.సిరివల్లి (చీరాల), జె.లావణ్య (చీరాల), డి.సుమ (చీరాల), బి.రత్నకుమారి (చీరాల), పి.వెన్నెల లక్ష్మి (చీరాల), వీసలోమి (అద్దంకి), ఎ.మానస (అద్దంకి), వై.సత్య (అద్దంకి), డి.యామిని (అద్దంకి), జి.అరణ్య (అద్దంకి), డి.సులోచన (అద్దంకి), పి.మేరి (చీరాల), నారాయ భూపతిపల్లికి చెందిన టి.నందిని, కే యశస్వినిలు ఎంపికయ్యారు.



అండర్-19 జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన బాలురు

బాలుర జట్టు..

జి.బాలాజి (సింగరాయకొండ), బి.లక్ష్మణ్ (సింగరాయకొండ), డి.యల్లమందారెడ్డి (చీరాల), ఎస్.లక్ష్మీతిరుపతి (యర్రగొండపాలెం), ఎ. రాజు (చీరాల), డి.తిరుమల(చీరాల), డి.గోపిరాజు (ఒంగోలు), యు.సాగర్ (ఒంగోలు), ఆర్ లీలా వెంకట పవన్ (ఒంగోలు), ఎం.హర్షద్ (ఒంగోలు), కె.దుర్గాప్రసాద్ (ఒంగోలు), జి.అశోక్ (ఒంగోలు), కె.సాయిరాం (ఒంగోలు), కె.బాలాజి (చీరాల), బి.మునినాయక్ (యర్రగొండపాలెం), కె.ఆంజనేయులు (దర్శి), కె.కాశీ విశ్వనాథం (ఇంకొల్లు), కె.ఏసోబు (పాదిలి), వో.తేజ (కొమరోలు), కె.బ్రహ్మ శివాజి (ఒంగోలు), జి.మహేంద్ర (కంభం)లు ఎంపికయ్యారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.



అండర్-19 జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన బాలికలు

స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు

డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు




స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు

బాపట్ల: దేశ ఆర్థిక వ్యవస్థ గ్రామీణ వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉంటుందని, ఆధునిక పద్ధతుల ద్వారా అధిక ఫలసాయాన్ని సాధించి దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచవచ్చని డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ పేర్కొన్నారని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అధిక దిగుబడులను ఇచ్చే గోధుమ, వారి వంగడాలను సృష్టించడం ద్వారా తాను నమ్మిన సిద్ధాంతాన్ని నిరూపించి చూపిన డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ అమరుడని అన్నారు. డాక్టరు ఎం.ఎస్.స్వామినాథన్ మృతికి స్థానిక వ్యవసాయ కళాశాల్లో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత దేశంలో 1970వ దశకంలో సంభవించిన ఆహార సంక్షోభానికి చలించి, ప్రజలు పస్తులుండే పరిస్థితి రాకూడదని పరితపించి వ్యవసాయ మార్కెట్లో సంస్కరణలకు ఆఖరి క్షణం వరకు కృషి చేసిన డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతి భారతీయ వ్యవసాయ రంగానికి తీరని లోటన్నారు. భారత దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుల ద్వారా రైతాంగ ఉన్నతికి కృషి చేసిన ఆయనను భారతదేశం ''హరిత విప్లవ పితామహుడు'' అని కీర్తించిందని, అంతేకాకుండా ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం ఆయనను 'ఫాదర్ ఆఫ్ ఎకనామిక్ ఎకాలజీ'గా గుర్తించిందన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలతో కూడా వారికి అనుబంధం ఉందని, 2006 లో కళాశాల డైమండ్ జూబ్లీ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొనడమే కాక ఆడిటోరియం శంకుస్థాపన కార్యక్రమంలో కూడా పాల్గొని కీలక ఉపన్యాసాలు చేసి ఆకట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చప్టాలో పడి వ్యక్తి దుర్మరణం

మేదరమెట్ల: చప్టాలో పడి గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల–తిమ్మనపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న చప్టాలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. సుమారు 40 సంవత్సరాల వయసు ఉన్న ఓ వ్యక్తి నీటి కుంటలో పడి ఉన్నాడన్న సమాచారంతో మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. నాలుగైదు రోజుల కిందట నీటిలో పడి మృతి చెంది ఉంటాడని, మూత్రవిసర్జన కోసం వచ్చి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. వీఆర్వో పంచనామా అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పీ.నాగశివారెడ్డి తెలిపారు.

ఏడు నుంచి డీఆర్‌ఎం కప్ క్రీడా పోటీలు



లక్ష్మీపురం: మొట్ట మొదటి సారిగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని అధికారులు, ఉద్యోగస్తులు, పలు ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు సైతం పాల్గొనే విధంగా డీఆర్‌ఎం కప్ నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో డీఆర్‌ఎం కప్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనేందుకు అక్టోబర్ 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుని నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్రికెట్ పోటీలు అక్టోబర్ 7,8,14,15వ తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు. 12 ఓవర్స్‌తో క్రికెట్ ముగుస్తుందన్నారు. విజేతలకు రూ.75 వేల క్యాష్ ప్రైజ్, రన్నర్స్‌కు రూ.50 వేలు బహుమతులుగా అందజేస్తామన్నారు. వాలీబాల్ అక్టోబర్ 7,8 తేదీలలో డీఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. వాలీబాల్ ప్రవేశ రుసుం రూ.1000, విన్నర్స్ రూ.10 వేలు, రన్నర్స్ రూ.5 వేలు, మూడో స్థానంకు రూ.3వేలు, నాల్గవ స్థానంకు రూ.2 వేలు కేటాయించామని తెలిపారు. బ్యాడ్మింటన్ పోటీలను అక్టోబర్ 7,8 తేదీలలో పట్టాభిపురం డీఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోటీలకు రూ.1000 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. విజేతలకు రూ.10 వేలు, రన్నర్స్‌కు రూ.5 వేలు, మూడో స్థానం వారికి రూ.3 వేలు, నాల్గొవ స్థానం వారికి రూ.2 వేలు నిర్ణయించడం జరిగిందన్నారు. వీటికి నిబంధనలు సింగిల్ సెట్ 30 పాయింట్స్, 21 బెస్ట్, 3 సెమీ, ఫైనల్స్ ఉంటాయని బూట్లు ఖచ్చితంగా ఉండాలని తెలిపారు. పోటీలలో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ఉద్యోగస్తులు, అధికారులతో పాటు డివిజన్ పరిధిలోని క్రీడాకారులు ఎవరైనా పాల్గొన వచ్చని, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, నల్గొండ, యాదాద్రి జిల్లాలకు చెందిన ఆధార్ కార్డులు కలిగి ఉండాలని లేని వారికి ప్రవేశం ఉండదని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 6వ తేదీలోగా రైల్వే అధికారులను సంప్రదించ వచ్చని తెలిపారు. సంప్రదించాల్సిన వారు గీతా, ఓఎస్‌డి 9121139141, వై.శ్రీనివారావు కోఆర్డినేటర్ 9347785888 నంబర్లను సంప్రదించాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం శ్రీనివాస్, సైమన్, సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో 14 మందిపై కేసు

క్రలు, రాడ్లతో ఓ కుటుంబంపై విచక్షణ రహితంగా దాడి

మార్టూరు: ఓ కుటుంబంపై మరో కుటుంబానికి చెందిన వ్యక్తులు విచక్షణ రహితంగా చేసిన దాడి విషయమై పోలీసులు 14 మందిపై కేసు నమోదు చేశారు. ఈఘటన గురువారం రాత్రి మార్టూరులో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మార్టూరు నేతాజీ కాలనీకి చెందిన నాగండ్ల సుబ్బారావు బుధవారం రాత్రి కారులో స్థానిక పోలేరమ్మ గుడి వీధిలో వెళ్తున్నాడు. రోడ్డుకు అడ్డంగా ఉన్న బైకును తొలగించాలంటూ ఆపకుండా కారు హారన్ పదేపదే మోగిస్తూ ఆవీధిలో నివాసం ఉండే మార్టూరు వీరాంజనేయులు అనే కుటుబంతో సుబ్బారావు ఘర్షణ పడ్డాడు. అందులో భాగంగా నాగండ్ల సుబ్బారావు ఫోన్ ద్వారా తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో సూమారు 15 మంది సుబ్బారావు కుటుంబసభ్యులు, బంధువులు క్షణికావేశంతో కర్రలు, ఇనుపరాడ్లతో మార్టూరు వీరాంజనేయులు, అతని సోదరులు శ్రీకాంత్, సతీష్‌లపై అసభ్య పదజాలంతో విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం గురువారం రాత్రి మార్టూరు వీరాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుపై నాగండ్ల సుబ్బారావు, అతని కుటుంబ సభ్యులు, సహకరించిన బంధువులు మెత్తం 14 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు.

జిల్లాలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరే...

బాపట్ల బాపట్ల జిల్లాలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులను నియమించారు. ఆ మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం జాబితా విడుదల చేసింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు కోరారు.

- బాపట్ల పట్టణ అధ్యక్షులుగా కాగిత సుధీర్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులుగా కోకి రాఘవరెడ్డి, కర్లపాలెం మండల అధ్యక్షులుగా యల్లావుల ఏడుకొండలు, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షులుగా ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డిని నియమించారు.

అద్దంకి నియోజకవర్గం..

అద్దంకి మండలానికి గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, సంతమాగులూరు చింతా రామారావు, బల్లికురవ చింతల పేరయ్య, కొరిశపాడు రావి శ్రీధర్, జే.పంగులూరు యర్రం శ్రీనివాసరెడ్డి, అద్దంకి మున్సిపాలిటీ కాకాని రాధాకృష్ణ

చీరాల నియోజకవర్గం..

చీరాల అంకాల రెడ్డి, చీరాల మున్సిపాలిటీ–1 కోంద్రు బాబ్జి, చీరాల మున్సిపాలిటీ–2 గుంటూరు మాధవరావు, వేటపాలెం బొడ్డు సుబ్బారావులు ఎంపికయ్యారు.

పర్చూరు నియోజకవర్గం..

పర్చూరు కఠారి అప్పారావు, యద్దనపూడి షేక్ శ్రీను, ఇంకొల్లు బండారు ప్రభాకరరావు, చినగంజాం నాగేశ్వరరెడ్డి, కారంచేడు దండా చౌదరిబాబు, మార్టూరు పఠాన్ కాలేషావలిలు ఎంపికయ్యారు.

వేమూరు నియోజకవర్గం

వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల అధ్యక్షులను నియమించారు. వేమూరు మండల అధ్యక్షులుగా బొల్లిముంత ఏడుకొండలు, అమర్తలూరు మండల అధ్యక్షులుగా యలవర్తి సురేష్ బాబు, చుండూరు మండల అధ్యక్షులుగా అన్నపురెడ్డి రఘురామిరెడ్డి, కొల్లూరు మండల అధ్యక్షులుగా సూర్యదేవర రామకృష్ణ, భట్టిప్రోలు మండల అధ్యక్షులుగా మోర్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు.

రేపల్లె నియోజకవర్గం

రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె పట్టణ కన్వీనర్‌గా గడ్డం రాధాకృష్ణమూర్తి, రేపల్లె రూరల్ మండల కన్వీనర్‌గా గాదె వెంకయ్యబాబు, చెరుకుపల్లి మండల కన్వీనర్‌గా పైనం ఏడుకొండలురెడ్డి, నగరం మండల కన్వీనర్‌గా జాలాది మునియ్య, నిజాంపట్నం మండల కన్వీనర్‌గా వీరంకి ముక్తేశ్వరావులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నాయకుల చేరిక

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్ సీపీలోకి విచ్చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని ఉప్పాలవారిపాలెం గ్రామం టీడీపీకి చెందిన అట్ల నాంచారయ్య, ఉప్పాల వెంకటేశ్వరరావు, దాసరి నాంచారయ్య, పీటా శ్రీనులతో పాటు 30 కుటుంబాల సభ్యులు మోపిదేవి సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు.

మోపిదేవి మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడు అండగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకరప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, మండల కన్వీనర్ పయనం ఏడుకొండలరెడ్డి, ఎంపీటీసీ పీటా రాంబాబు, సర్పంచ్ కూరేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువాను కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 22 కేజీల గంజాయి పట్టుకున్న పోలీసులు
- దీని విలువ సుమారు రూ.2 లక్షలు

జే.పంగులూరు: అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితులను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు తిరుమల్లవయురుకు చెందిన ధనుష్, తుని మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన కిల్లి మురళి నిందితులు మండల పరిధిలోని కొండమంజులూరు క్రాస్ రోడ్డు వద్ద ఈ నెల 28వ తేది రాత్రి 9 గంటల సమయంలో జాతీయ రహదారిపై కారులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండగా రేణింగవరం పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 22 కేజీల స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరిచారు. అంతరాష్ట్ర గంజాయి ముఠాని పట్టుకున్న సీఐ ఉమేష్, ఎస్సై కేకే తిరుపతిరావును సిబ్బందిని బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.



పట్టుకున్న గంజాయి ప్యాకెట్లతో ఎస్సై తిరుపతిరావు

కష్టపడి చదివినప్పుడే లక్ష్యాలను చేరుకోగలరు

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేత

బాపట్లటౌన్: కష్టపడి చదివినప్పుడే నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోగలరని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పోలీస్ సిబ్బంది పిల్లలకు శుక్రవారం మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. చదువుకుంటున్న పోలీస్ సిబ్బంది పిల్లల్లో పదవ తరగతి, ఇంటర్, ఎంటెక్, డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్‌లలో 2021–22గానూ మంచి మార్కులు సాధించిన 31 మందికి రూ.5,56,000 మెరిట్ స్కాలర్ షిప్‌ను పోలీసు సంక్షేమ నిధి నుంచి అందజేశారు. ప్రతి సంవత్సరం పోలీసు సంక్షేమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ కార్యాలయం నుంచి ప్రతి జిల్లాలోని పోలీస్ సిబ్బంది పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్‌లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఈ నగదును చెక్కుల రూపంలో అందజేసే వారిమని, ప్రస్తుతం నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా పోలీస్ శాఖ అమలు పరుస్తున్న కార్యక్రమాలను పోలీస్ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, బి సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధా, పోలీసు సిబ్బంది పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందుకున్న పోలీసుల పిల్లలు

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం: ఒంగోలు

H.No. 7-1004 A & B, 2వ అంతస్థు, హరిహర నగర్, 2వ లైను, మంగమూరు రోడ్డు, ఒంగోలు - 523 002

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వ ప్రకటన నెం. S.O. 1533 తేది:14–09–2006 మరియు దాని సవరణను అనుసరించి శ్రీ బొమ్మిశెట్టి శంకర్ రావు, గురిజేపల్లి గ్రామం, సంతమాగులూరు మండలం, బాపట్ల జిల్లా నందు సర్వే నెం.71/2P లోని 1.852 హెక్టార్లలో తలపెట్టిన బ్లాక్ గ్రానైట్ మైనింగ్ కార్యకలాపాల ప్రతిపాదన కొరకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన జారీచేయబడినది. సదరు ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన వివరములు ప్రాజెక్టు ప్రతిపాదించిన వారిచే దిగువన ఇవ్వబడిన విధముగా ఉన్నవి.

1.	కంపెనీ పేరు, చిరునామా & ఫోన్ నెంబర్	శ్రీ బొమ్మిశెట్టి శంకర్ రావు, డోర్ నెం.8-137, 10వ క్రాస్ రోడ్, లాయర్‌పేట ఎక్స్‌టెన్షన్, మంగమూరు రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్–523002 ఫోన్ నెం: 98491 15116.
2.	ప్రతిపాదిత స్థాపన ప్రదేశము మరియు విస్తీర్ణం	సర్వే నెం. 71/2P, గురిజేపల్లి గ్రామం, సంతమాగులూరు (మం), బాపట్ల జిల్లా. భూమి విస్తీర్ణం: 1.852 హెక్టార్లు
3.	సంప్రదించవలసిన అధికారిక వ్యక్తి చిరునామా మరియు ఫోన్ నెం.	శ్రీ బొమ్మిశెట్టి శంకర్ రావు, ప్రాజెక్ట్ ప్రొపోనెంట్ డోర్ నెం.8-137, 10వ క్రాస్ రోడ్, లాయర్‌పేట ఎక్స్‌టెన్షన్, మంగమూరు రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్–523002 ఫోన్ నెం: 98491 15116.
4.	ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.68 లక్షలు
5.	కార్యకలాపాల రంగం స్వభావం మరియు సామర్థ్యం	ఓపెన్ కాస్ట్ మైనింగ్ ద్వారా బ్లాక్ గ్రానైట్ సాలీనా 7,763 క్యూబిక్ మీటర్లు
6.	ప్రజాభిప్రాయ సేకరణ తేది సమయం మరియు ప్రదేశం	తేది : 02-11-2023 సమయం: ఉదయం గం॥ 11-00 లకు ప్రదేశం : ప్రాజెక్టు దగ్గరలో సర్వే నెం.71/2P, గురిజేపల్లి గ్రామం, సంతమాగులూరు మండలం, బాపట్ల జిల్లా.
7.	ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన వివరములు, సదరు ప్రాజెక్టు డ్రాఫ్ట్ EIA రిపోర్టు మరియు దాని యొక్క ఎగ్జిక్యూటివ్ సమ్మరి (తెలుగు & ఇంగ్లీషు) ప్రజలకు అందుబాటులో ఈ క్రింది కార్యాలయాల్లో ఉంచడమైనది. ఎ. కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, బాపట్ల జిల్లా. బి. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, ప్రకాశం జిల్లా. సి. రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, చీరాల, బాపట్ల జిల్లా. డి. జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, బాపట్ల జిల్లా. ఇ. మెంబర్ సెక్రటరీ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, విజయవాడ. ఎఫ్. జోనల్‌ఆఫీస్ – ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, విజయవాడ. జి. ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్ (IRO) MoEF&CC, విజయవాడ. హెచ్. ప్రాంతీయ కార్యాలయం – ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఒంగోలు. ఐ. తహసిల్దారు వారి కార్యాలయం, సంతమాగులూరు (మండలం), బాపట్ల జిల్లా. జె. గ్రామ సచివాలయం, గురిజేపల్లి (గ్రామం), సంతమాగులూరు (మండలం), బాపట్ల జిల్లా.	

ప్రజల సలహాలు, అభిప్రాయాలు, వ్యాఖ్యలు మరియు అభ్యంతరములు ఏమైన ఉన్నట్లయితే ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 30 రోజుల లోగా కోరడమైనది. పైన పేర్కొనబడిన విధముగా సంబంధిత ప్రజలు, నిర్వాసితులు, పర్యావరణ బృందాలు & చేపట్టబోయే ఈ ప్రాజెక్టు ద్వారా ప్రభావితం చెందే ప్రజానీకం మరియు ఇతరులతో సహా తమ సలహాలను / అభ్యంతరాలను / వ్యాఖ్యలను roogl-ee1@appcb.gov.in కు e-మెయిల్ ద్వారా లేదా వ్రాతపూర్వకముగా ఈ దిగువ సంతకం చేయబడిన అధికారి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారికి పంపవచ్చును మరియు పైన తెలుపబడిన తేది, సమయం మరియు ప్రదేశమున జరుగు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో కూడా పాల్గొని తమ అభిప్రాయాలు తెలుపవలసినదిగా కోరడమైనది.

ప్రదేశం : ఒంగోలు
తేది : 29-09-2023

సం/-
పర్యావరణ ఇంజనీరు
ఆం.ప్ర. కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు